౨. క థ లు

క్షమావతి

సహదేవ సూర్యప్రకాశరావుగారు

౧

క్షమావతి. ఆమె త్యాగశీలిని. ఆమె ప్రాచీనసాహిత్య సాహిత్యమున తన జీవితమును పునీత మొనరించుకొన్నది. పూర్వప్రాయమునుండి యనుభూతముగా జ్యోతిషశాస్త్రము నవగతముచేసికొని యమూల్యసూక్తములను నావిష్కరించినది. ఆయపూర్వసూత్రములే నాటినుండి నేటివఱకు హిందూహృదయమున శబలితరోచిస్సులతో నాయకమణులగా ద్యోతించుచున్నవి.

ఆమె మేధావి. ఆమె ద్రష్ట. ప్రతిస్వల్పవిషయము నామె ప్రకృతిభండారమునుండియే సేకరించుకొన్నది. ఆమె వ్రేలికొనలు నిరంతర మేతారకాగణమునో గుణించుచుండును. వివిక్తవిభావరీవేళల నామె తరళనయనము లేగ్రహాగతినో పరీక్షించుచుండును.

ఆమె విజ్ఞానతృష్ణకు ఆవలి సీమ లేదు. అందుచేతనే జీవితాంతము నామె హృదయప్రశాంతిని నోచుకొనలేదు. నూత్నదర్శనములకు, నూత్నపరీక్షలకు నామె తపించిపోయెడిది.

దైనందినకార్యము లామె వ్రేలిగుణింపులను జరిగిపోవలయును. నాడు జరగినవి. నేడు జరగుచున్నవి. ఆమె సమంకితసూత్రము లంతగా హిందూకేదారమున వేళ్లు పాఱినవి; తొలకరించినవి; సుమించినవి.

ఆమె నందనప్రమదావనమునుండి జారిపడిన పారిజాతప్రసూనము. ఆయమరసుమప్రమదామణి నెటుల గైసేయుటో ఈర్ష్యావిలులగు పండితశౌండులకు దెలిసినదికాదు హృదయము గ్రహించిన మిహిరునకు దెలిసినదికాదు.

౨

క్షమావతి పండితకుమారి. ఆమెతండ్రి అతనాచార్యుడు వ్యుత్పన్నుడు, విద్యాచార్యుడు, కాశ్మీరబ్రాహ్మణుడు. సమగ్రవిద్యావ్యాసంగములో నాతనితల నెరసిపోయినది. విద్యాకాంక్ష యాతని కనులలో నింకను తరళించుచుండెను. ఆమరణాంతము నాతడు నవీనశాస్త్రచర్చ గావించినాడు.

రెండుమూడు శతాబ్దములకుపూర్వము హస్తినాపురము (ఢిల్లీ) రాజకీయాందోళనలపాలయి యట్టుడికినట్లుడుకసాగినది. ఆరాజకీయవిప్లవవాయువు లాశ్రీపాసకుని విద్యాసమాధినుండి లవలేశమేని కదలింపలేదు.

అపరూపవ్యక్తులకు లోకవాసనలతో నిమిత్తములేదు. వారలకు ద్వంద్వముల భేదాభేదము లుండవు. వారు అతీతులు.

కొన్ని జనపదములు నిర్ధూమధామము లయినవి. విప్లవకారులు కొందఱు సార్వభౌముని ప్రాణాపహరణమునకు బూని విఫలీకృతు లయినారు. సంఘమరణములు సంభవించినవి. సస్యలక్ష్మిని కార్మొయిళ్లు కాఱుక్రమ్ముకొన్నవి. విశేషములపై విశేషములు తామరతంపరలవలె వచ్చుచుండెను. కాని యేబదియేండ్లు పై

బడిన ముదుసలి చెక్కుచెదరనిహృదయముతో గ్రహభ్రమణములను గుర్తించుచుండెను.

తూరుపుదెసను నీలాంబరవక్షమును ముద్దాడు కాశ్మీరపర్వతశ్రేణి; పడమర హిందూకుష్ పర్వతపాళి. ఆమధ్యప్రదేశము ప్రకృతిప్రసాదితము. అది నైసర్గిక సౌందర్యఖండము. ఆగ్రామము శ్రీనగరము; అతనాచార్యుని జన్మస్థానము.

3

కుమారావతి తల్లిలేని బిడ్డ. ఆమెను గని తల్లి కదళీ తరువువలె నశించిపోయినది. ఆమె మాతృప్రేమోన్మీలన రాగనయనములను నొక్కపరియేని చూడలేదు. ఆమె వసుంధరావక్షమున పసిగన్నులు తెఱచునప్పటికి ఆయ మృతవాత్సల్యనేత్రములు మూసికొనిపోయినవి. చిరంతనము మూసికొనిపోయినవి.

అతనాచార్యుడు వాత్సల్యము పుంజీభవించిన పుణ్యమూర్తి. జరాభారమున ముగ్గిన పండుహస్తములతో నాసుకుమారిని అల్లారుముద్దుగా పెంచినాడు. పూలపొత్తికలలోనుంచి లాలించి తల్లిలేని లోపమును కలిగించినాడుకాడు. ఆతడే యామెకు తండ్రి, తల్లి, సర్వస్వము.

ఆతని ముదినడకలలో నామె తప్పటడుగులు కలపినది. ఆత డస్తమింపనున్న జ్యోతి. ఆమెజీవితజ్యోతిర్వర్తి ఇంకను మసివాఱలేదు; నుసిపోవలేదు. తండ్రి విజ్ఞానరోచిర్మయూఖను తనలో విలీన మొనరించుకొన్నది. ఏబదియేండ్లనుండి స్వానుభవమున గ్రహించిన జ్యోతిషశాస్త్రతత్వము నామె చిన్నారిప్రాయముననే యలవరించుకొన్నది. అతనాచార్యు డొకనాడు కుమార్తె నేత్రములలో ఉజ్వలతారకాద్వితయమును చూచినాడు. భ్రుకుటినాట్యములో దీక్షను, తృష్ణను పరికించినాడు.

అప్పటి కామెకు పదియేండ్లు దాటినవి. పదకొండవయేడు ప్రవేశించినది. అప్పటికే యామె గణితశాస్త్రమును తండ్రివేలితిప్పులను నేత్రపక్ష్మంములను నేర్చికొన్నది. భాస్కరాచార్యుని సూత్రములు, వరాహమిహిరుని సూక్తములు కొట్టినపిండి యయినవి.

ఆయేకాంతజనపదము—మూసికొన్న వాతావరణము—వ్యాప్తిలేని యాప్రకృతి—ఆమెదృష్టిప్రసారమునకు చాలినదికాదు. ఆమె విజ్ఞానవీక్ష ప్రపంచించిపోవలయునన్న విశాలాశావకాశములు కావలయును.

అతనాచార్యుడు యోచించినాడు. పుట్టిననాటి నుండి వాసముచేయుచున్న జన్మభూమి. కుమార్తె పురోభివృద్ధి. దేనిని కాంక్షింపవలయును? అది సమస్య. ఒక ప్రశాంతనిశాంతమున కన్నీళ్లతో నొక నిశ్చయమునకు వచ్చినాడు. కుమారికాసహితుడై అంతటి వయస్సులో అతనాచార్యుడు వారణాసికి ప్రయాణము చేసినాడు

౪

వారణాసి విద్యాసరస్వతికి పుట్టినిల్లు. పావనగంగా సవంతిచే పునీతమయిన పుణ్యాతలము. సాహిత్యము, శాస్త్రము అక్కచెల్లెండ్రు. పారపొచ్చెములు లేకసాహార్దముతో మెలగుచుందురు. నాటి కళాలయములకు నేటి కళాలయములకు ఆకృతులలో, రీతులలో, బోధనాపద్ధతులలో విపర్యాస మున్నది. ఏయాశయము నాడు హిందూ హృదయమున ద్యోతించెనో, ఆయాశయమే నేడు హిందూహృదయమున ప్రభావంత మగుచుండెను. అందులో పరిణామము లేదు. ప్రవహించునది ఒక్కటే స్రవంతిక. ఒక్కటే గత్యము. కాని దానినిజేరు గతులు వేఱు. గతులు భిన్నములయినను ఆశయ మొక్కటే అయినప్పుడు మన్నింపవలయును.

బ్రహ్మచారులు విద్యానిరతులై అచ్చటికి వచ్చుచుందురు. ఉభయసంధ్యల వేదఘోష. శాస్త్రపఠనము పవమానవీచికల తేలితేలి గంగాతరంగాగ్రముల తూగాడుచుండును.

కాశికాపురి విశ్వనాథుని కాణాచి. భారతసంహిత ప్రణేత వ్యాసభగవానుడు ఒక్కనాటి యాకటివేగున కాగికోలేక వారణాసిని నిర్దహింప యత్నించినాడు. అది కొనసాగినదికాదు. పార్వతి అన్నపూర్ణమ్మయై ఆఋషి కల్పుని యలుక మాన్పి ముద్దుగా సుద్దులుచెప్పినది.

అతనాచార్యుడు జగమెఱింగిన బ్రాహ్మణుడు. ఆతడు జగము నెఱింగినవాడు.

పండుతమలపాకువయస్సులో ఆతనికన్న మెఱయించు విషయ మేముండును? కుమారివ్యుత్పన్నురాలు కావలయును. అదియే యాతడు కాంక్షించునది. అంత కన్న నితరము నాశింపడు.

ఆనవీనసీమలో తండ్రికుమార్తె లిరువురు అచ్చటి పరిస్థితులను తెలిసికొనుచు కొంతకాలము గడపినారు.

కుమావతి వయస్సుచెడ్డది. ప్రకృతిలోని ప్రతి నూత్నవిషయమును అలవరించుకొన అఱ్ఱెత్తిచూచును. కేలు సాచును. క్రేళ్లుఱుకును. ఒక్కొక్కప్పుడు విక్రీత మయిపోవును.

అతనాచార్యుని రాక మొదట కాశికావిశ్వేశ్వరుని దేవాలయఘంటికలలో మ్రోగెను. గంగాతరంగాగ్ర వీథుల బడిపోయి ఆశాంచలముల నల్లుకొన్నది. ఆతని యాగమనము ప్రతిజీవికి జీవముపోసినది. వారణాసియే చదువుల పాలవెల్లి యయిపోయినది. నాటికినేటికి విద్యాసంస్థలలో వన్నెయు, వాసియు గన్నది.

ఒక్కొక్కశాస్త్రములో సిద్ధులైన పండితప్రకాం సన్నిధిని చేరి బ్రహ్మచారు లావిద్యను సమగ్రముగా ంచెదరు.

కొలదికాలమునకే అతనాచార్యుని గృహము యిపోయినది. కన్నులలో విద్యారోచిస్సు బ్రహ్మచారికి ఆతని గృహము తేనెపట్టు

కొలదికాలమునకే వివిధశాస్త్రపండితశిఖావతంసులతో నాతనికి పరిచయ మయినది.

ఇది కుమావతివిద్యాభిరతికి దోహద మయినది కాశికాపురివాతావరణమే ఆమెను సంపూర్ణముగా మార్చివేసినది. దీక్ష కన్నులలో తళుక్కొత్తినది. తృష్ణ హృదయమున పూర్ణించుకొన్నది. వికాసము వదనమున ప్రభాసించినది.

తండ్రి ఉగ్గుబాలతో రంగరించిపోసిన జ్యోతిష శాస్త్రమున కిప్పు డామె యధ్యాయము చెప్పకొనసాగినది. ఇతరశాస్త్రములు దానికి ప్రోది. విద్యాసార్వభౌముల మధ్య మెలంగుచు కుమావతి యనూచాన హిందూజ్యోతిషమును జీర్ణించుకొన్నది. ఆమె భావిభవితవ్యము ఆనందగీతాతోరణములతో విరాజిల్లుట కదియే మూలకందము.

విద్యామధువును గ్రోలుటకు హరిదంతపదముల నుండి యువకభ్రమరకుమారులు దీక్షాపక్షముల నల్లార్చి కొనుచు అతనాచార్యుని గృహారామమును జేరి శాస్త్రఝంకారము చేయసాగిరి.

అందులో నెన్నదగినవాడు మిహిరుడు. ఆతడు బ్రాహ్మణబాలకుడు; వంగీయుడు. ఆతని గ్రామము చంద్రపురము. ఆపురము లేతతమలపాకుల పంటకు పేరెత్తినది. దాని నాథుడు చంద్రకేతువు. ఆతడు ఢిల్లీసార్వభౌముని సామంతుడు. ఏటేట కప్పములు గట్టివేయుచు ఆతని రాజభక్తిని వెల్లడించుచుండెను. ఆతడు సరసుడు, రసజ్ఞుడు.

మిహిరుడు చంద్రకేతుని ఆశ్రితుడు. ఆతనికొలమువా రారాజవంశమున కొలువు చేయుటయేగాక ఏదియో సంబంధబాంధవ్య మున్నదనికూడ ప్రతీతి.

చంద్రకేతుని సాదరవీక్ష మిహిరునిమీద ప్రసరించినది. మిహిరున కాస్థానపండితుల సంపర్కము కలిగి

నది. వ్యాకరణము, ఛందస్సు, గణితము, జ్యోతిషము నేర్చికొనినాడు. నేర్చికొన్న విద్యకు శాణపెట్ట జన్మ సీమను వీడి మిహిరుడు అతనాచార్యుని గృహమున కాలిడినాడు.

తెలివితేటలలో, సూక్ష్మగ్రహణములో మిహిరుని చెప్పి యింకొకరిని చెప్ప[illegible]లయును. అతనాచార్యుని సుధా ప్రసన్నదృష్టి యాతనిపై వ్రాలినది. గురుదేవుని హృదయమున నాతని కావాసము లభించినది.

అతనాచార్యుని కుడికన్ను క్షమావతి; ఎడమకన్ను మిహిరుడు. ఇద్దఱియెడ నెఱమఱికలు పాటింపక విద్యా ప్రదానము చేయుచున్నాడు.

మిహిరుడు క్షమావతి సహాధ్యాయి. అతనితో నామెక్లిష్టసమస్యలను, విద్యావిషయములను చర్చించెడిది. అప్పుడప్పుడు వారు కొన్నిసిద్ధాంతములు చేసి తామరస పత్రములో నిడి గురుసన్నిధిని చేర్చెడివారు. గురుదేవుడు ఆసిద్ధాంతములను సమాలోచనము చేసి పరిష్కరించి వాని కగ్రస్థానము నిచ్చెడివాడు.

క్షమావతిబుద్ధి కత్తిమొనవంటిది. పదను విశేషము. అది స్త్రీప్రకృతికి సహజము. ఏవిషయమున నయిన నామె తన నెచ్చెలితో తీసిపోయెడిది కాదు. ఒక్కొక్కప్పుడు శాస్త్రచర్చలో ముందంజవేసి మిహిరుని యోడించెడిది. అసాధ్యములయిన సమస్యలను దూదిపింజలవలె విడదీసి విద్యాపీఠమును ఉత్సవముతో ముంచెత్తెడిది. అతనాచార్యున కానందము అమందము. మిహిరునకు కన్నెఱ్ఱ కొంచెము.

చిన్ననాటినుండి క్షమావతికి జ్యోతిషమన్న పెరుగన్నము. సహజదోహదమువలన నది వికాసిల్లినది. నేడు జ్యోతిర్విద్యలో ఆమె కందెవేసినచేయి లేదు. ఆ విద్య అనితరదుర్లభము. సామాన్యవిద్యార్థి దానిపొంతకు బోలేడు. ఆవిద్యారహస్యములను క్షమావతి మిహిరునకు సూచించినది, బోధించినది. ఆతని కాశాస్త్రరహస్యములు మనమెక్కినవి కావు. ఆశాస్త్రపరిశోధనమందు మిహిరుడు విస్తారము జోక్యముచేసికొనలేదు. అదియంతయు క్షమావతికి వదలివేసినాడు.

ఆసహాధ్యాయులు యువకులు. ఒకచెట్టునీడనే విద్యాసమాధిలో మునిగెడివారు. పూజాపురస్కారములకు ఒక్కసారి లేచి ఒకచెట్టుపూవులను కోసికొని తెచ్చి కూర్చెడివారు. ఆకూర్చిన దండలో వారివారి వాంఛా ప్రసూనములను చేర్చెడివారు. అది సహజము. అవిలంఘ్యము. ఇంచుమించుగా ఇరువురుసమానవయస్కులు. అందులో విపరీత మేమున్నది?

స్నేహసూత్రముకన్న నపూర్వసూత్ర మేదో వారి హృదయములను సూత్రీకరించినది. కన్నులను కలపినది. దరహాసములలో సుధామధువును చిలకరించి పోసినది.

అతనాచార్యుడు గ్రహించినాడు. ఆతని హృదయము ప్రాపంచికవిషయసమాలోచనములో పండిన హృదయము. ఆతడు లౌకికుడు. ఆలోచించినాడు. చిఱునవ్వుకొన్నాడు. వారు ముగ్ధులు కారు. చదువుకొన్నవారు; హృదయమున్నవారు. వారి లక్ష్యమునకు స్థిరత్వము నాపాదింపవలయును. వారి భవితవ్యజీవితపథమును సుగమము చేయవలయును.

౬

నాడు కాశికి బోయినవారు మగుడిరారని వాడుక. మధ్యమార్గముననో, కాశీవిశ్వనాథుని యాలయ శిఖరమును చూచియో కొనప్రాణములను విడచివైతురని అభిప్రాయము. ఆనాడులలో ప్రయాణమన్న ప్రయాసము. దారిలో ఎన్నియో కాలిచెప్పులు అరిగిపోవును. యాత్రార్థులు వారి సమస్తమును ఆప్తుల కప్పగించేసి ప్రయాణించెడివారు.

కారుమొయిళ్లు దొంతరదొంతరలః లెన్నికవిసినను దరిద్రులకే! శ్రీమంతులు షట్కముల కెట్లు దూరులో, అట్లే కష్టములకు :

తీర్థయాత్రాచణశీలియై చంద్రపుర రాజేశ్వరుడు బయలుదేరినాడు. అనుచరులతో, మిత్రులతో, విదూషకులతో, రాణువతో బయలుదేరినాడు. రాజేశ్వరులు కాననసీమ నున్నను, సగరమున నున్నను విభేద ముండబోదు. రథయానము, నావికాయానము సమానమే.

అది శుభవాసరము. వృద్ధపురోహితులు కంపితకంఠములతో ఆశీర్వచనములను గురియించుచున్నారు. మధురమోహనవాద్యములు మొరయుచుండెను. యమునానదిపై చంద్రకేతువు వారణాసికి బయలుదేరినాడు.

ఆయమునాహృదయము తరంగిత మగుచుండెను. నదీవక్షమును చీల్చికొనుచు నావ బడిపోవుచుండెను. ఆచుట్టునున్న ప్రకృతిశోభ కన్నులకఱవు దీర్చును. ఆయనంతనైసర్గికమాధుర్యమున విలీనమయిపోబుద్ధి జనించును. కవితాహృదయము లీలాతాండవ మాడును. దాని కంత ముండబోదు, తుది కానరాదు.

దూరమునుండి కాపుల ఏలపాటలు, నీపవృక్షముల మాటుననుండి గోపాలుర అవ్యక్తమురళీధ్వనులు శ్రుతిపర్వ మగుచుండెను. అది యేమి కనులవిందు. అపరారుణరాగరేఖాంచితసాంధ్యలక్ష్మి యమునాస్రోతస్వినీభంగాగ్రవీధుల నృత్యకేళి చేయుచుండెను. ఏహృదయము ఆనందమున నిట్టూర్చదు. నాటి పాటగాని మురళీగీతికలను దాచుకొన్న యమున అప్పుడప్పు డాపాటల తీయదనములను మోయలేక మలయకుమారికల కప్పగించుచుండెను.

కష్టమన్న నేమో ఎఱుంగక చంద్రకేతువు వారణాసికి జేరుకొనియెను.

అట్టివారికి ప్రయాణసౌలభ్యము విదితముకాదు. వారు రాజులు. రాజులురాజులు.

వంగభూమిప్రాంతముననుండి సుధామధుకణము గంగపుష్కరిణీతీరమున వచ్చిపడినదని పసికట్టినారు. పండాలు, పురోహితులు, వైదికులు, వందలు తండోపతండములుగా వచ్చి మూగినారు.

శాంతికపౌష్టికకర్మలను నెఱపుటకన్న చంద్రకేతుని కన్నులలో ఒకవాంఛ మెరయుచుండెను. అతనికి మిహిరుని చూడవలయుననియున్నది. ఆతనికోరిక నెఱిగి, మంత్రి మిహిరునికోసము ప్రతిసంస్కృతవిద్యాపీఠమునకు పండాసహాయమున పరిచారకులను పంపినాడు.

తుదకు పరిచారకులు క్షమావతితో శాస్త్రచర్చ చేయుచున్న మిహిరుని గనుగొన్నారు. వానికి చంద్రకేతుని యాదేశము నివేదించినారు. ఆతనిహృదయము అవ్యక్తానందము ననుభవించినది. కాని చెప్పుకోలేని భావ మాతనిని కుంచించినది. చిరునవ్వుతో క్షమావతి చెంత సెలవుదీసికొన్నాడు. చంద్రకేతుని సన్నిధానమునకు బోయి మూర్తీభవించిన విద్యామూర్తివలె నిలువబడినాడు. ఆవిశిష్టమూర్తిని చూడగనే చంద్రకేతునకు అపరిమితానందము కలిగినది.

మిహిరుడు పెరిగి పెద్దవా డయినాడు. అంగకములు మాంసలములై స్నిగ్ధములైనవి. చేరలకు గొల్వగల్గు కన్నులలో మహస్సు వెలిగిపోవుచున్నది. నూనూగుమీసములు తుమ్మెదచాలు లైనవి.

మిహిరుని యోజస్సు చంద్రకేతువు గ్రహించినాడు. ఆవిద్యాసముద్రుడు తన యాస్థానమున నుండ నభిలషించినాడు. రాజుగారి కోర్కె మిహిరునకు దెలిసినది.

ప్రత్యుత్తరముకోసము రాజు ఎదురుచూచుచుండెను. వినీతభావమున క్రిందుకు వాంచియున్న మొగము నెత్తి మిహిరుడు చంద్రకేతుని చూచినాడు.

అది నిశ్చయముగా మిహిరునకు పరీక్షాసమయము. చంద్రపురాస్థానములో పండితపదవి కోరుకొనకయే వచ్చుచున్నది. ఆతని శ్రమలకు ఫలము కలిగినది. ఆతని స్వప్నముల కాకృతి యేర్పడినది. అది బహుజన్మ

కృతానేకఫలము. అతని చుట్టపక్కములలో నిరంతము ఉండవచ్చును. కాని క్షమావతి. క్షమావతి ఆతని గన్నులకు గట్టినది. ఆప్రేయోమూర్తి నెట్లు వీడిపోవగలడు? ఆమె యాతనిపాలి పారిజాతము. ఇప్పుడు వియోగమన్న చిరవియోగమే కాక బహుజన్మవియోగ మగును. అంత నాతనిలో ఒకయూహ మెఱసినది. ఆతని ముఖముద్రికలను చంద్రకేతువు గుర్తింపకుండనుండ లేదు.

“ప్రభూ! ధన్యుడను. న న్నాహ్వానించి మీ యుదారహృదయమును వెల్లడించినారు. చంద్రపుర విద్యాపరిషత్తులో నుండవలసినంత యోగ్యత నాకడ లేదు. మీ రొసగు గౌరవతాత్పర్యములకు నేను తగను. నే నింకను విద్యార్థిని. జ్యోతిషమున వన్నెయువాసియు గన్న వ్యుత్పన్నుని దీసికొనిపొండు. వారణాసి పండిత శౌండులకు పుట్టినిల్లు.”

“మే మెఱుంగుదుము. నీయెడ మాకు గల సద్భావము ని న్నాహ్వానించినది. ఈప్రదేశము మాకు నూతనము. ఇచ్చటి పండితుల పరిచయము మా కంత లేదు. అయినను చంద్రపురము ఇసుకఎడారి. అచ్చటకు రా నెవ్వ రభిలషింతురు?”

“సత్యము. కాని మాగురుదేవులు జ్యోతిషమున నిధి. వారణాసి వారికి జేజేలువెట్టినది. ఈయూరు వారికి గ్రొత్త.”

“వారు వచ్చుట కంగీకరించెదరా?”

“బహుశః అంగీకరింపవచ్చును. వారి కొక్కగాని యొక్క కుమార్తె. ఆమె విద్యాసరస్వతి. ఆయమపురోభివృద్ధికొఱకే వారీపురము విజయముచేసినారు. ఆమె నొక్కగృహిణిగా జేయవలయునని మాగురుదేవుల ఆశయము. మీరు ఆహ్వానించిన వారు మారుపలుకకపోవచ్చును”

ఆమాటల భావమును చంద్రకేతువు చిఱునవ్వుతో గ్రహించినాడు.

అతనాచార్యుని దర్శనము మఱునాడు చేయుదు నని చంద్రకేతువు పలికినాడు.

మిహిరుడు తలవాంచికొనియే గురుపీఠాభిముఖుడైనాడు.

౭

తపస్వికన్యల పాదలాక్షారుణాంక రేఖికలవోలె నరుణారుణరాగములు మెఱసినవి. దూరమున రేగుచున్న హోమపరీమళధూమము నాహరించుకొని, పూర్ణించుకొని మందమయినది ప్రత్యూషఃపవనము.

అవి సంక్రాంతిదినములు. క్షమావతి వేకువనే లేచినది, వాకిట కలయంపి చల్లినది; వింతవింత అందములతో క్రొత్తగ్రొంగొత్త ముగ్గులను రచించినది. వాని కామెయే ప్రణేత కాబోలు.

అది ఒక ప్రశాంతప్రదేశము. ఉన్నతతలమున ఒకకుటీర మున్నది. నాలుగు బారల దూరములో శుక్రవార మభ్యంగస్నానము చేసి పూజాద్రవ్యములతో దేవాలయమునకు పోవు పుణ్యకాంతవలె గంగాభవాని ప్రవాహిల్లుచున్నది.

కుటీరమునకు దక్షిణపార్శ్వమున గున్నమావి ఉన్నది. ఆమావిచాయల రాతిచప్పరము లున్నవి. విద్యార్థులు కిలకిలమనుచు కూర్చుండిఉన్నారు. పావుకోళ్ల ధ్వని అయినది. గుసగుసలుపోవుచున్నవారు నిమ్మకు నీరొత్తిన ట్లయినారు. అతనాచార్యుడు వచ్చి కృష్ణాజినమున పద్మాసనములో గూర్చుండెను. ఒకబ్రహ్మచారి ముందునకు వచ్చి వల్లెవేసిన శ్లోకములను అప్పగించెను. వేఱొక కాకపక్షుడు వేదమున కన్వయము చెప్పకొనసాగెను. మిహిరుడు ద్వారముఖమున దృష్టిసారించి చూచుచున్నాడు. అప్పుడప్పుడుమాత్రము గురుదేవుని సౌమ్యవదనము నాలోకించి, కాంతులువిరిసికొన్న చూపులతో, సిగ్గుతో క్షమావతిని చూచుచున్నాడు. క్షమావతి కన్నులు త్రపాప్రసన్నము లగుచున్నవి; సుధాప్రసన్నము

లగుచున్నవి. ప్రతిమానచంద్రులతో ప్రభాసిల్లుచున్న నీలిసరస్సు లామెకన్నులు. నిరంతరతారకాపరీక్షవలన ఆమెకనులు తారకలైనవి.

“మహారాజరాజశ్రీ పరమభట్టారక చంద్రకేతు మహారాజులుంగారు విజయముచేయుచున్నారు” అని విన్నవించినాడు.

బ్రహ్మచారు లావార్తను లక్షింపక ఎవరి పాఠము లను వారు చదువుకొనసాగిరి. మిహిరుడు గురుదేవుని వంక సాకూతదృష్టితో చూచెను. గురుదేవుడు లేచి నిలువబడెను.

శిష్యుడు గురుదేవు ననుసరించెను. క్షమావతి చంచలదృగంచలములు మిహిరునిపై వ్రాలినవి. మిహి రుడు చిఱునవ్వినాడు.

రాజునకు స్వాగతమీయ ఛాత్రసమేతుడై అతనా చార్యుడు కొంచెముముందున కరిగినాడు. చంద్రకేతువు రాజలాంఛనములతో ఎదురయినాడు. ఆతడు సాహిత్యే శ్వరుడు; ఈతడు రాజ్యేశ్వరుడు. ఆకృతిలో, నడకలో, కన్నులలో నెంతవ్యత్యాసము. మిహిరుడు గురుదేవుని చంద్రకేతువునకు బరిచయముచేయ నవసరము లేక పోయినది. నమస్సులు, దీవనలు, కుశలప్రశ్నలు జరగినవి.

అందఱు కలసి పర్ణశాలకు అరుదెంచినారు. ఆప్రశాంతపునీతవిద్యాపీఠమును చూచి రాజు నిట్టూరి నాడు. ఆనందమున నాతని హృదయము పింపిళ్లు గూసినది.

చెప్పలేక చెప్పలేక రాజు తన అభీప్సితమును నివేదించినాడు :

“మాది ఒక పెద్దఎడారి. మీరు విద్యాసింధువు లరు. మీవిజ్ఞానవిలోకనమున వారణాసి ధన్య అయినది. మాపురమునకు విజయముచేసి మమ్ము ధన్యుల జేయ వలయును ” అని పునీతభావమున పలికినాడు.

ఆవిజ్ఞాపనముతో క్షమావతి అతనాచార్యుని కన్నులకుగట్టినది. ఆతనికి షష్టిపూర్తి అయినది. అతని కేమి కావలయును? కుమార్తెపురోభివృద్ధి. అంతకన్న నావృద్ధున కేమి కావలయును? ఆతని కొక ప్రశాంత ప్రదేశము కావలయును. కుమార్తెకు ఒక ప్రశాంత గృహము కావలయును.

అదివఱకు అక్కడకు వచ్చి నిలచియున్న క్షమా వతివంక తండ్రి చూచినాడు. ఆమెచూపుల భావమును గ్రహించినాడు. ఆతడు జ్యోతిషి.

మిహిరునివంక చూచినాడు. ఆతని చూపుల భావమును గ్రహించినాడు. ఆతడు లౌకికుడు.

జ్యోతిర్మయూఖవలె నున్న క్షమావతి చూడ గనే చంద్రకేతుని చేతులు తమంతటనే జోహారు వెట్టినవి.

“తమంతట తాము వచ్చి యడిగినప్పుడు కాదన జాలను. నాదృష్టికి దేశవిభేదము లేదు. ఇంతటినుండి వంగదేశము నాదేశము. నాకుమార్తెసౌభాగ్యము నా భాగ్యము ” అని గురుదేవుడు పలికినాడు.

చెంతనున్న శిష్యుల కన్నులు చెమ్మగిల్లినవి.

౮

కాశ్మీరబ్రాహ్మణుల ఇంటిఆడబడుచు వంగదేశీ యుల కోడలైనది.

ఆమెపారాణిపాదము వంగగృహమున బెట్టగనే వంగదేశలక్ష్మి నిత్యకల్యాణము పచ్చనితోరణముతో ప్రభావంత మాయెను.

ఆమెవిజ్ఞానము సర్వతోముఖముల వ్యాపించినది. భర్తసహాయమున, తండ్రిఆచార్యకమున ఆమె జ్యోతి ర్విద్యలో కూలంకషపాండిత్యము గణించుకొన్నది. ఆ నాళులలో జ్యోతిషశాస్త్రమున నామె కందెవేసిన చేయి లేదు. నేడు లేదు. అపూర్వములుకాదు, క్లిష్టసమస్య లయినను నామెచేతిలో దూదిపింజలట్లు విడిపోవలయును.

అంతవఱకు వంగహృదయమునకు గ్రాహ్యముకాని జ్యోతిస్సూత్రముల నామె ఎన్నిటినో సిద్ధాంతీకరించినది, నిరూపించినది.

ఆమె యతిలోకవిదుషీమణి. అయినను ఆమె సహజస్త్రీత్వమును విడనాడికోలేదు. ఆమె తన విద్యవలన మానసికప్రవృత్తిని పరివర్తనముచేసికొన్నది.

భర్తయందలి ప్రేమము శివజటాజూటచ్యుతపవిత్రగంగాజలముకన్న పవిత్రమయినది, స్వచ్ఛమయినది. తండ్రియందలి భక్తివాత్సల్యములు పొరపొచ్చెములు లేనివి. నక్షత్రగత్యగ్రహణముతోపాటు గృహకృత్యనిర్వహణము నామె ఏమఱుటలేదు. తోడిస్త్రీలతో కలసిమెలగునప్పు డామె వినీతమును కోరుకోలేదు.

క్షమావతికి చంద్రకేతుని జోహారులతోపాటు ఉపహారములకుగూడ పరిమితి లేదు. ఆతని దానహస్త మామెశిరస్సున శాశ్వతముగ నిలిచిపోయినది.

అంతటివిజ్ఞానవతి, అంతటిజ్యోతిషి, అంతటిరూపవతి తన యాస్థానమునం దుండెనని చంద్రకేతుని గర్వమునకు నిస్సీమ.

అచ్చటి పండితశౌండుల ఆదరణమున చంద్రకేతుని భావములో పరిణామము కలిగినది. పండితావతంసులు కారణము గ్రహించినారు. క్షమావతి వారి సుఖోపజీవితమార్గకంటకి అని గ్రహించుకొన్నారు. ఆమె సిద్ధాంతీకరించిన నూత్నసూత్రములకు ఔదలలు వంచినవారు నేడు పెడమొగ మయినారు. వారికన్నెఱ్ఱకు మంకెనలు మాసినవి.

క్షమావతి ఎంతటి విజ్ఞానశీలియో, అంతటి నమ్రశీలి.

ఇరువదిరెండేండ్లు దాటకుండగనే మొలకవెన్నెలవంటి ఆమెయశస్సు వసంతపదములతో హరిదంతపదము అను మాఱుమ్రోసినది.

ఆమెను దండ నుంచుకొని భారతమాత సాంధ్యనటుని నిత్యతాండవకేళిలో తన పదవిన్యాసము చేసినది.

సరస్వతియే మానవరూపమున భూతధాత్రి నవతరించి శ్రీముఖమున జ్యోతిర్విద్యను ప్రతిష్ఠించినదని నాడు చెప్పుకొన్నారు; నేడు చెప్పుకొనుచున్నారు.

పండితుల హృదయమున రేకొత్తిన భావము ఫలప్రదముకాక నూరకపోదు.

ఆమెపతనకారణము నెమకుచున్నారు. వారు పండితులు. వారి కవగతముకాని విషయము లుండవు. ఎంతటి నైచ్యమున కొడిగట్టిఅయిన వారి కార్యమును సాధించుకొందురు. ఈర్ష్యావిలులు కార్యసాధనమున ఉచితానుచితములు పాటింపరు.

క్షమావతిజీవిత మొక విజయగీతి. ప్రతిపదము విజ్ఞానమునకే నూత్నములయిన సూత్రములతో నిండిపోవుచుండెను. ప్రతిపదము ఉపజ్ఞతో, ఓజస్సుతో పూర్ణించిపోవుచుండెను.

ప్రతిదినము ఆమె ఏదియో ఒక నూత్నసిద్ధాంతమును కనుపెట్టుచుండెను. ఆమెమూలమున ఎన్నియో గోపనవిషయములు వెల్లడిల్లినవి. ఆమెపాండితీప్రకర్షకు దిగ్గజములవంటి పండితులే తెలతెల్లబోవసాగిరి. ఆమె పురోభివృద్ధి సభాపండితులకు హృదయశల్య మయినది.

చంద్రకేతుని దయావీక్ష వారినుండి మరలి క్షమావతియెడ కేంద్రీకరించినది. వారి మాటకు సభలో పాటింపు లేదు. వారి విజ్ఞానచంద్రికలను క్షమావతి యశఃకీర్తులు ముంచెత్తినవి. ఇది భరింపరానిది.

౬

౧౨౪౨-వ సంవత్సరప్రాంతమున వంగభూమిలో భూకంపము వచ్చినది. శతవృద్ధు లిట్టి భూకంపమును చూచియుండలేదని మాట యిచ్చిరి. గ్రామములు క్రుంగుడుపోయినవి. పంటలు ధ్వంసము లయినవి.

క్షామము వచ్చినది. నిలువనీడలేక, తినుటకు తిండిలేక ప్రజలు అల్లాడిపోసాగిరి. ఆవత్సరము ప్రజానాశనము, గోనాశనము, సస్యనాశనము పెచ్చుపెరిగినది. దినము దినము దుర్భిక్షు ప్రబలుచుండెను. నిమిషనిమిషమునకు జనుల ఆక్రందనములు చంద్రకేతుని వీనుల సోకుచుండెను. "అన్నమో రామచంద్రా" అనుపదము వారి జీవితగీతికి అనుపల్లవి అయిపోయినది.

చంద్రకేతువు కరుణాప్రసన్నుడు. వారి ఆక్రందనములకు వాని మనస్సు వెన్నవలె కరగిపోయినది. క్షామ నివారణోపాయ మాలోచింపవలయును. ఎంతధనమైన వెచ్చింప నిశ్చయించి చంద్రకేతువు ఒకనాడు సభతీర్చినాడు. పండితులను రావించినాడు. ఆనిండుసభలో క్షామమునకు ప్రతిక్రియ నూహింపవలయునని పలికినాడు.

వారు మీనమేషములను గుణించినారు. శ్లోకములను పఠించినారు.

భూదేవి ప్రకోపమందినది. ఆమెశాంతికి శాంతి కర్మలను చేయవలయును అని సూచించినారు.

ఎంతటి విజ్ఞానవిశిష్టుడైనను మిహిరుని పూర్వవాసనలు వదలినవికావు. పండితుల సూచన అతని యంగీకారమందినది.

చంద్రకేతువు శాంతికకర్మాచరణమునకు కావలసిన ధనము ధారవోసినాడు. ఈవిషయము క్షమావతి చెవిసోకినది. ఆమె పకాలున నవ్వినది. తన మిహిరుడు పండితుల మాటలకు తలయొగ్గినని విని కొంచెము వేధిల్లినది. కాని ఆమె హృదయమును మార్చుకొనలేదు.

ఇన్నినాళ్లు సకలశాస్త్రములను తఱచి నిగ్గును సంపాదించుకొన్న పండితప్రకాండులు ప్రకృతిసహజసూత్రములను గుర్తింపలేరైరని యామె చింతించినది. ప్రకృతి పరిణామమును పరివర్తనము సేయ దేవతారాధనలు, శాంతికపౌష్టికకర్మలు వినియోగించునా? భూకంపకారణము ఆమె చక్కగా సిద్ధాంతములతో నిరూపించి చెప్పినది. ఆమె వాదమును ఎదుర్కొనవలసినదని విద్యావిశిష్టులను ఆహ్వానించినది.

ఒక్కరు ఆమెఆహ్వానమును అంగీకరింపలేదు. కాని ఆమెపై నిప్పులు చేటలతో చెరగిపోసినారు. కోపముతో వారు పరవళ్లు ద్రొక్కినారు.

స్త్రీ తమను ధిక్కరించుటయా? సమయము లభించినది. అణగియున్న వారి కోపము, ఈర్ష్య రేగినవి. పండితులు ఎవరికి దోచినట్లు వా రామెను తూలనాడిరి. నిండుసభయనిఅయిన యెంచలేదు.

"ఈభూకంపమునకు కారణము ఆమంత్రకత్తెయే! ఆమెమూలముననే పాడిపంటలతో నిత్యకల్యాణముగా నుండెడి ఈదేశము ఈతిబాధలకు లోనయినది. ఆమె నీదేశమునుండి తరలింపవలయును" అని కొందఱు ఏకకంఠ్యముతో బలికినారు.

ఆతీర్మానమును తక్కిన పండితతల్లజులు ఏకగ్రీవముగా ఆమోదించినారు.

ఆమెపై పండితులు లేనిపోని నీలాపనిందలు కల్పించినారు. మిహిరుని చెవిలో విషము నూరిపోసినారు. ఆముగ్ధహృదయుడు కిమ్మనలేదు.

"క్షమావతి వంగదేశమునుండి తరలిపోవలయును." అని చంద్రకేతువు మ్రొక్కినకరములతో ఆశ్రీముఖమును లిఖించినాడు.

మిహిరునకు ఏమియు పాలుపోయినదికాదు. ఇంతకుపూర్వమే ఆమెతండ్రి దివంగతుడయినాడు. ఆమె ఏకాకిని.

౧౦

ఆమె చనిపోయినది. కాని ఆమె ప్రతిహిందూహృదయమున జీవరాగకళలతో పిసాళించుచున్నది.

హిందూవనితకు త్యాగము పెట్టినదిభిక్ష. ఆమె కాలి నుసియయి తన బూదినుండి ఇతరులకు సౌఖ్యా

మును పంచిపెట్టినది. అందుచేతనే భారతమాత గౌరవముతో తాండవించుచున్నది.

యుగయుగాంతరములనుండి ఒక్కటే గీతి, ఒక్కటే శ్రుతి, ఒక్కటే చరిత ఆవృత్త మగుచున్నది. నామరూపములలో భేదమున్నను, వస్తువులో భేదములేదు. అది విశిష్టవిషయము.

పార్వతీపరమేశ్వరులు పురాణదంపతులు, అర్ధనారీశ్వరులు. వారలే హిందూస్త్రీపురుషులకు ఆదర్శప్రాయులు. ఒకరు లేకున్న ఒకరు జీవింపలేరు. హిందూ గృహలక్ష్మి ఏకాంతజీవితము నెఱుగదు.

మిహిరుడే చంద్రకేతుని శ్రీముఖమును దెచ్చి క్షమావతికి ఇచ్చినాడు. ఆమె చూచుకొన్నది. ఆతడు కంపిల్లుచు ఆమెముందల నిలువబడినాడు. చిఱునవ్వు మాత్ర మామెచికిలిపెదవులనుండి చెదరిపోవలేద. విధిశాసనానుగతికి జోహారువెట్టినది. ఆమె తనకోస మెన్నడు తలారింపలేద. కాని ఆమె ఎంతటి విజ్ఞానమూర్తిఅయినను స్త్రీ అమాయకుడయిన తన నాధుని జూచి కన్నీరోడ్చినది. ఈర్ష్యావిలులగు పండితుల చేతులలో చేయికలపినందులకు మిహిరునిపై ఆమె జాలి నొందినది.

"ధన్యను, నామృత్యువును నా నాధుడే ప్రసాదించినాడు"అని అనుకొన్నది. సంధ్యాసమయము. క్షమావతి జీవితకావ్యమునకు ఆశ్వాసాంత మగుచున్నది. దూరమునుండి ఆమెభరతవాక్యమును ఒక శకుంతము పఠించుచున్నది. దేవాలయఘంటికానినాదములో వెలికి ఏదో కవిసినది.

సంధ్యాసమయము. మిహిరుడు కులదేవతకు పూజాపురస్కారములు చేయుచున్నాడు. చందనగంధములతో అగరుధూపములతో అర్పించినాడు. దేవిని గొంతెత్తి నుతించినాడు. స్తోత్ర మయినది. కనులు మూతగొన్నవి. మిహిరుడు నిశ్చలసమాధిలో మునిగినాడు. ఒక పాషాణవిగ్రహముసన్నిధిని ఇంకొక పాషాణవిగ్రహ మయిపోయినాడు. ఆతని జీవనసంధ్యలో ప్రార్థనాగీతి సమాప్త మయినది. కనులు విచ్చినాడు. కనులు విచ్చి దేవీమూర్తిసమక్షమున రక్తపువెల్లువలో విగతజీవియై పడియున్న ప్రతిదేవీమూర్తిని పరికించినాడు

క్షమావతి చేసేత దేవతాహస్తమునుండి కరవాలమును గొని నిండుజీవితములను త్యజించుకొన్నది. రక్తపుసోనలో దోగియున్న విశిష్టత్యాగశీలిని మిహిరుడు చూచినాడు. స్థాణు వయినాడు.

"ప్రభూ! నేను మరణించుచున్నాను. నీవంశము, నీదేశము మంగళోత్సవములతో వెలుగునను సంతృప్తితో నేను మరణించుచున్నాను. ప్రభూ! నమస్సు" అని దేవీ ముఖమునుండి వెలువడినవి.

అవియే కకుబంతముల ప్రతిధ్వనిల్లినవి. ప్రతిచిగురాకు, ప్రతిచిఱుగాలి, ప్రతిచిఱుకెరటము ఆసందేశముతో వంగదేశమును ముంచెత్తినది.

ఆమె చనిపోయినది. కాని ప్రతిహిందూహృదయమునను ఆమె జీవరాగకళలతో పిసాళించుచున్నది.

ఆమె త్యాగశీలిని.